క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



గ్రీన్ అంబాసిడర్లకు సూచనలిస్తున్న డీపీవో మల్లికార్జునరావు

డెంకాడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి డి.మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని పినతాడివాడ గ్రామంలో మంగళవారం పర్యటించిన ఆయన..పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో భూగర్భజలం మారుతుందని, ఈ క్రమంలో కొత్త రోగాలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అనంతరం స్వామిత్వ సర్వేపై అధికారులను ఆరాతీశారు. 25వ తేదీ లోగా గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేయాలన్నారు.. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి టి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వరిసాగులో సస్యరక్షణ కీలకం



అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారిణి నీలిమ

పూసపాటిరేగ: వరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం కీలకమని మండల వ్యవసాయ అధికారిణి కె.నీలిమ సూచించారు. మండలంలోని కుమిలి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించి, వరిసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వరినాట్లు వేసే వారంతా నాట్లు వేసే ముందు చిగుర్లు తుంచి నాటాలన్నారు. ఇలా నారు చిగురు తుంచివేసి నాటడం వల్ల పంటకు పీకపురుగు ఆశించకుండా ఉంటుందన్నారు. వరినాట్లు వేశాక కాలిబాటలు వేసుకోవాలన్నారు. కాలిబాటలు వల్ల పంటకు గాలి, వెలుతురు బాగా లభిస్తుందని, ఏపుగా పెరుగుతుందన్నారు. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల చొప్పున కాలిబాటలు ఉండేలా చూసుకోవాలన్నారు.

విద్యార్థులకు వ్యాధి నిరోధక టీకాలు



విద్యార్థి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారి భాగ్యరేఖ

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు వ్యాధి నిరోధక టీకాలు మంగళవారం వేశారు. రెల్లివలస పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యరేఖ పర్యవేక్షణలో వైద్యారోగ్య సిబ్బంది విద్యార్థులకు టీకాలు వేశారు. ప్రతి విద్యార్థి వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు ప్రభుత్వం వేస్తున్న ఈ టీకాలను వేయించుకోవాలని వైద్యాధికారి కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్‌ఈవో శివ, ఎంపీహెచ్ఈవో రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైతే అర్జీ పెట్టుకోండి




కమిషనర్ నల్లనయ్య

విజయనగరం టౌన్: అనర్హులని నోటీసులు అందుకున్న దివ్యాంగులంతా తాము అర్హులమని భావించినట్లయితే నగరపాలక సంస్థ కమిషనర్‌ను సంప్రదించి, అర్జీలు పెట్టుకోవాలని కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. అధికారులు అర్జీని పెన్షన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి తదుపరి కార్యాచరణ చేపడతారన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆస్పత్రికి హాజరుకావాలన్నారు. ఎప్పుడు, ఎక్కడ అనే వివరాలను నోటీసు ద్వారా తెలియజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు తమకు సమీపంలోని వార్డు సచివాలయ కార్యదర్శులను సంప్రదించాలన్నారు.

విగ్రహావిష్కరణ

విజయనగరం టౌన్: స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలోని శ్రీపైడితల్లి చదురుగుడి పునర్నిర్మాణం, పైడితల్లి విగ్రహావిష్కరణ మంగళవారం జరిగింది. వేదపండితులంతా అమ్మ వారికి విశేషార్చనలు చేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం పంచిపెట్టారు. కార్యక్రమంలో దాత బర్ల నాగేశ్వరరావు దంపతులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

విజయనగరం టౌన్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియంలో నర్తనశాల డ్యాన్స్ అకాడమీ చిన్నారులు మంగళవారం ప్రదర్శించిన నృత్యం చూపరులను అలరించింది. బుధవారంతో ఉత్సవాలు ముగుస్తాయని, భగవద్గీతను ప్రతిఒక్కరూ చదవాలని ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞానవేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు వి.శంకరరావు తెలిపారు.

ఖాళీ స్థలాలు.. దోమలకు ఆవాసాలు!



గుర్రపుడెక్క, ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా ముందుకు కదలని మురుగు

- భోగాపురం మేజర్‌పంచాయతీలో దోమల బెడద
- దోమలకు నిలయంగా వ్యర్థాలతో నిండిన స్థలాలు
- కాలువల్లో నుంచీ పుట్టుకొస్తున్న దోమలు
- జ్వరాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు



ఈ పచ్చదనమూ దోమల పెరుగుదలకు కారణమే..



నీటి బట్టీలో పెరిగిన చెట్లు

భోగాపురం: మేజర్‌పంచాయతీలోని ఖాళీ స్థలాలు దోమలకు ఆవాసాలుగా మారాయి. చిన్నచిన్న బట్టీలు(కాలువలు), వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో ఉన్న స్థలాలు దోమలకు నిలయమయ్యాయి. దీనికితోడు పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో వీధి కాలువలు మురుగునీటితో దర్శనమిస్తున్నాయి. దీంతో ఇక్కడి ప్రజలకు దోమల బెడద ఎక్కువైంది. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయని బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే పలువురు మలేరియా బారినపడి ఆస్పత్రి పాలైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వానాకాలంలో దోమల బెడద..

ఏటా వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. వానల వల్ల లోతట్టు ప్రాంతాలు, వర్షపు నీరు ముందుకు కదలని ప్రాంతాల్లో నీరు కొన్నిరోజుల పాటు నిల్వ ఉండిపోయి దోమల పెరుగుదల విపరీతంగా ఉంటుంది. ఈ మేరకు ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు చేయించాలి. వీధులు, రోడ్లు, కాలువలు, ఖాళీస్థలాలు లాంటి స్థలాల్లో చెత్తాచెదారం లేకుండా చూడాలి. అయితే ఈ చర్యలేవీ కానరాకపోవడంతో భోగాపురంలోని కొమ్మూరు, తోట, మరడ, చిన్న వీధులు సహా పెదహరిజనపేట తదితర ప్రాంతాల్లోని దోమల సమస్య రానురాను అధికమవుతోంది. దీంతో అక్కడి వారంతా దోమలతో నిత్యం నరకయాతన పడుతున్నామని వాపోతున్నారు. ఇదే ప్రాంతాల్లో పలువురు బోదకాలు వ్యాధితో బాధపడిన వారు కూడా ఉండడం గమనార్హం.

ఏడాదిగా పారిశుధ్య పనుల్లేవ్!

ఏటా పారిశుధ్య పనులు చేపట్టేవారు కానీ ఈ ఏడాది పారిశుధ్య పనులు చేయలేదు. ఈ క్రమంలో బట్టీలు, మురుగు కాలువల్లో పూడికతీతలు అలాగే ఉండిపోయి అవే దోమల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఎక్కడ చూసినా గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో బట్టీలు, కాలువలు ఉండడంతో వాటిల్లో నుంచి మురుగునీరు ముందుకు కదలడం లేదు. దీంతో ఆయా ప్రాంతాలు దోమలు ఎక్కువగా పెరిగే ప్రాంతాలుగా తయారయ్యాయి. ఈ సమస్య పరిష్కారం కోసం ఎంతమంది అధికారులు, నాయకులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..



సచివాలయ సిబ్బంది ద్వారా ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి, వారి స్థలాల్లోని తుప్పలు, డొంకలు, పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు మురుగు కాలువలను శుభ్రం చేయించి, దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నాం. త్వరలోనే బట్టీల్లో పూడికతీతలకు చర్యలు చేపడతాం.

– రాజాన జయమ్మ, పంచాయతీ ఈవో, భోగాపురం

ప్రమాదకరంగా రోడ్డు మధ్యలోని గుంతలు



విజయనగరం జిల్లా కేంద్రం రోడ్డు మధ్యలోని గుంతలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రధానంగా కోట నుంచి మూడు లాంతర్ల జంక్షన్ రోడ్డులో ఏర్పడిన గుంతలు రోజురోజుకూ పెద్దవిగా తయారవుతున్నాయి. రోడ్డు మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం వహించడం కారణంగానే గుంతలు భారీగా అవుతున్నాయని స్థానికులు, వాహనదారులు అంటున్నారు. ఏ ప్రమాదం జరగకముందే రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

– ఫొటోగ్రాఫర్, విజయనగరం

వినతిపత్రం అందజేత



ఎస్పీ వకుల్ జిందల్‌కు వినతిపత్రం అందజేస్తున్న వయోశ్రేష్ఠుల సంఘం జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు జగన్నాథరావు

విజయనగరం టౌన్: వయోశ్రేష్ఠుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎస్పీ వకుల్ జిందల్ హామీ ఇచ్చారని వయోశ్రేష్ఠుల సంఘం జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బి.జగన్నాథరావు తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మంగళవారం కలిసిన ఆయన వయోశ్రేష్ఠుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ సమస్యల పట్ల ఎస్పీ సానుకూలంగా స్పందించారని వృద్ధుల ఆస్తి, ప్రాణరక్షణ చట్టం జిల్లాలో సక్రమంగా అమలయ్యేలా చూడాలని ఎస్పీని కోరడం జరిగిందన్నారు. అలాగే తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంక్షేమ నియమావళి సరిగా అమలు జరిగేలా చూడాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో సీనియర్ సిటిజన్ల సమస్యలు అధికారుల దృష్టికి వచ్చేలా స్థానిక సీనియర్ సిటిజన్ సంఘాల ప్రతినిధులతో కమిటీలు ఏర్పాటు చేయాలని కోరామన్నారు.

• వితరణ

డెంకాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐహెచ్‌ఆర్‌సీ(ఇండో హ్యూమన్ రైట్స్ కేర్) సంస్థ వారు గొడుగులు మంగళవారం వితరణ చేశారు. ఆ సంస్థ జాతీయ చైర్మన్ రాజన్‌ప్రసాద్ ఆదేశాల మేరకు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు జి.సత్యనారాయణ, జిల్లా సెక్రటరీ నాయుడులు పాఠశాలకు వచ్చి 50 మంది విద్యార్థులకు గొడుగులు అందజేశారు. వర్షాల సమయంలోనూ పాఠశాలకు విద్యార్థులు వచ్చేందుకు ఉపయోగపడతాయని వీటిని ఇచ్చామని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

• నియామకపత్రాలు అందజేత



నియామక పత్రాలు చూపిస్తున్న వారితో ఐటీఐ కన్వీనర్ గిరి, తదితరులు

విజయనగరం అర్బన్: స్థానిక ఐటీఐలో జూలై 27వ తేదీన నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్–2005లో ఉద్యోగాలకు ఎంపికైన ఐటీఐ విద్యార్థులకు నియామక పత్రాలు మంగళవారం అందజేశారు. మొత్తం 175 మంది ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు హాజరు కాగా వారిలో 96 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయని ఐటీఐ కన్వీనర్ టీవీ గిరి తెలిపారు. ఈ మేరకు ఉద్యోగాలకు ఎంపికైన వారిని ఐటీఐ అధ్యాపకులు అభినందించారు.

10 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు



108 వాహనంలో గాయపడిన వ్యక్తులు

పూసపాటిరేగ: స్థానిక పెట్రోల్‌బంక్ సమీపంలో సర్వీసురోడ్డులో జరిగిన ప్రమాదంలో 10 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే శ్రీకాకుళం నుంచి విజయనగరం వైపు మంగళవారం వెళ్తున్న ఆర్‌టీసీ బస్సు పూసపాటిరేగ పెట్రోల్ బంకు సమీపంలో సర్వీస్ రోడ్డులో నిలిపి ఉన్న ట్యాంకర్‌ను బలంగా ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణం చేస్తున్న 10 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తులను 108 వాహనం, వైవే అంబులెన్సులలో సుందరపేట ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బస్సులో ప్రయాణం చేస్తున్న అదపాక బంగారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఐ.దుర్గా ప్రసాద్ తెలియజేశారు.

పరిశీలన పేరిట అర్హుల పింఛన్ల కోత

నెల్లిమర్ల రూరల్: కూటమి ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేయకపోగా పరిశీలనల పేరిట అర్హుల పింఛన్లలో భారీగా కోత విధించడం అన్యాయమని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ ఓ ప్రకటనలో మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో భర్త చనిపోతే వెంటనే భార్యకు పింఛను మంజూరు చేయడం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదన్నారు. ఇప్పటికే చాలామంది కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారని, వాటిని మంజూరు చేయకుండా అర్హుల పింఛన్లు తొలగించడం సరికాదన్నారు. మంచానికే పరిమితమై రూ.15 వేలు పింఛన్లు అందుకుంటున్న దివ్యాంగులకు వైకల్యం శాతం తగ్గించి వారికి అన్యాయం చేస్తున్నారన్నారు. తక్షణమే అర్హుల పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ప్రశాంత వాతావరణంలో గణపతి ఉత్సవాలు జరగాలి



మహిళా పోలీసులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ గణేష్

నెల్లిమర్ల: ప్రశాంత వాతావరణంలో గణపతి ఉత్సవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ బి.గణేష్ తెలిపారు. ఈ నెల 27వ తేదీన వినాయక చవితి పండగ కానుండడంతో వేడుకల నిర్వహణపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులతో ఎస్‌ఐ మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసే సౌండ్ సిస్టమ్‌కు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డీజే సౌండ్‌లు, మందుగుండు సామగ్రి వినియోగించరాదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని కోరారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ఫొటోగ్రాఫర్ సత్యనారాయణమూర్తిని సన్మానిస్తున్న నిర్వాహకులు

విజయనగరం టౌన్: స్థానిక పూల్‌బాగ్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ గ్రంథాలయ సంఘం, కుసుమంచి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ ఫొటో, వీడియోగ్రాఫర్లను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కుసుమంచి సుబ్బారావు మాట్లాడుతూ అందమైన జ్ఞాపకాలు, తీయటి అనుభూతులే ఫొటోలని, అలాంటి వాటిని మనకు అందిస్తున్న ఫొటోగ్రాఫర్లను సన్మానించుకుని గౌరవించడం మన బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రంథాలయ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్, కార్యదర్శి సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం అర్బన్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని, కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో 'ఫొటో జర్నలిజం ఫర్ రెసిలియంట్ కమ్యూనిటీస్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వర్సిటీ జర్నలిజం, సోషల్ వర్క్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కెనడాలోని థాంప్సన్ రివర్స్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బాల నిక్కు పాల్గొని, సామాజిక చైతన్యంలో ఫొటో జర్నలిజం పాత్ర, ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజలకు వివరించాలి

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం టౌన్: కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను ఇంటింటికీ వివరించాలని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నగర పరిధిలోని 18వ డివిజన్‌లో మంగళవారం పర్యటించిన ఆయనకు స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని, ఎన్నికల హామీల అమలులో కూటమి వైఫల్యాలను ఎండగట్టారు. ఎన్నికలప్పుడు ప్రజలకు లేనిపోని హామీలిచ్చి ఊదరగొట్టారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చి 14 నెలల కాలం దాటినా ఇంతవరకు హామీలన్నీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో నాలుగు పథకాలు అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకం వల్ల లబ్ధిదారులందరికీ పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదన్నారు. చాలామంది అర్హులకు పథకాలు అందకుండా పోతున్నాయన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఆడబిడ్డ నిధి, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ వంటి హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు గోల పెడుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి వీరవెంకట రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడు, పార్టీ విజయనగరం అధ్యక్షుడు ఆశపు వేణు, నాయకులు అవనాపు లక్ష్మణరావు, పిన్నింటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



హుకుంపేటలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల, పార్టీ నాయకులు



ఇంటింటికీ వెళ్లి, చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆశపు వేణు తదితరులు



విజయనగరం టౌన్: ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రావణి

హామీలు అమలులో కూటమి విఫలం..

విజయనగరం టౌన్: నగరంలోని ఆరో డివిజన్‌లో మంగళవారం జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిలు పాల్గొని, ప్రజలకు చంద్రబాబు చేస్తున్న మోసాలపై ఇంటింటా ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది కాలం దాటినా హామీలన్నీ ఎందుకు అమలు చేయలేకపోయారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో అధికారంలోకి వచ్చిన ఏడాదికే పథకాలన్నీ అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం ఎంతకాలం వెల్లదీస్తే అంతకాలం పథకాలు ఎగ్గొట్టవచ్చన్న రీతిలో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని, అప్పటివరకు ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ నిలదీస్తూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉష, అనూష, సుజాత, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించండి



కోట వద్ద నినాదాలు చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ(భారత విద్యార్థి ఫెడరేషన్) మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టింది. ఆ సంస్థ నాయకులంతా విద్యార్థులతో కలిసి కళాశాల నుంచి కోట జంక్షన్ వరకు ర్యాలీ చేసి నినాదాలు చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సీహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ 2019లో మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేటి వరకు సొంత భవనాలు ఏర్పాటు చేయకుండా ఉండడంలో రహస్యమేంటో తమకు అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహారాజా సంస్కృత కళాశాల.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒకే భవనంలో నడుస్తున్నాయన్నారు. దీంతో తరగతి గదులు, మౌలిక సదుపాయాలు, ల్యాబ్‌లు, లైబ్రరీల సదుపాయాలు కరువయ్యాయని, విద్యార్థులంతా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని మాన్సాస్ పరిధిలో ఉన్నటు వంటి బీఈడీ, లా, ఇంటర్మీడియట్ కళాశాలలు, ఎయిడెడ్ పాఠశాలలన్నీ మూతపడ్డాయని, ఆ భవనాలు ఖాళీగా ఉన్నందున అందులో ఏదో ఒక భవనాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తాత్కాలికంగా కేటాయిస్తే విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు అందించినవారవుతారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ దీక్షా పీఠం సర్వసభ్య సమావేశం

విజయనగరం టౌన్: స్థానిక చదురుగుడి ఆవరణలో శ్రీపైడిమాంబ దీక్షా ఆది పీఠం సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ ఏడాది అమ్మవారి దీక్షలు చేపట్టబోయే వారికి చేయాల్సిన ఏర్పాట్లు, పీఠం పెట్టేందుకు చేసే కార్యాచరణపై ఈ సమావేశంలో సమీక్షించారు. అనంతరం పైడితల్లి దేవస్థానం అధికారులకు పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.సూర్యపాత్రో, సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహేష్, అచ్చిరెడ్డి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

విజయనగరం అర్బన్: మహారాజా అటానమస్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ జి.హరీష్‌కు విశ్వవిద్యాలయ స్థాయి ఉత్తమ వలంటీర్ అవార్డును, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పీఎస్‌బీ శర్మకు జిల్లా స్థాయి ఉత్తమ ప్రోగ్రాం అధికారి అవార్డు, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ అధికారి జి.చంద్రశేఖరరావుకు ఉత్తమ నోడల్ అధికారి అవార్డును ఆంధ్ర యూనివర్సిటీ అందజేసింది. వైస్ చాన్సలర్ రాజశేఖర్ చేతులమీదుగా వారికి ఇటీవల అవార్డులు రాగా వారిని మహారాజా కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు మంగళవారం అభినందించారు.